# న్నారి పిడుగులు

చిత్రాదేవి

మా అమ్మమ్మకు డజను మంద పిల్లలు - అరడజను ఆడా, అరడజను మగా... ఆమె నిక్షేపంగానే ఉంది, ఇప్పటికీ. మా అమ్మకు అరడజనుకు ఒకరు ఎక్కువ - నలుగురు ఆడా, ముగ్గురు మగా... ఆమె కూడా మహా నిక్షేపంగా ఉంది.

మరి నాకూ!

ఇద్దరంటే ఇద్దరే పిల్లలు - ఒక ప్లస్సూ, ఒక మైనస్సూ... నేను మాత్రం నిక్షేపంగా ఉన్నానని ధైర్యంగా చెప్పకోలేను.

ఎంచేతంటే - మా అమ్మమ్మకూ, మా అమ్మకూ పుట్టింది పిల్లలు మాత్రమే, మరి నాకు మాత్రం పుట్టింది పిడుగులాయె! నేనెలా నిక్షేపంగా ఉండగలను.

> పాపిట మొదట్లో పావుకిలో ఎర్రటి కుంకుమ అద్ది వుంది. నుదుటి మీద అరకిలో కుంకుమతో పెదరూపాయి కాసంత బొట్టు పెట్టి ఉంది. చిన్నటి ఎర్రపూవుల మధ్య నీలపు ఆకులున్న పసుపు చీర కట్టుకుని ఉంది. అదే రంగు జాకెటు వేసుకుని, చెవులకి పెద్ద పెద్ద రవ్వల కమ్మలూ, ముక్కుకి ఇరువైపులా బొటనవేలంతటి ముక్కెరలూ, మెడలో ఓ పదికిలోల కిమ్మత్తు కలిగిన రకరకాలయిన దండలూ, వేసుకుని ఉంది.

దేశంలో కుటుంబ నియంత్రణ వారి పుణ్యమా అని ఇద్దరంటే ఇద్దరే! పుట్టారు. ఏ డజనో, అరడజనో పిల్లలు అయి ఉంటే ఏ అడవుల్లోకో పారిపోయి ఉండేదాన్ని!

మా వారు టిఫిన్ చేసి తొమ్మిది గంటలకే ఆఫీసుకి వెళ్ళి పోయారు. మా నోము ఫలాలకి టిఫిన్ అన్న పదార్థం పెట్టాలికదా అని, ఇంటి బయటికొచ్చి - "ఏయ్ బప్పీ! ఒరేయ్ కిన్నూ!! అంటూ గొంతు చీలిపోయేలా పిల్చాను.

"ఆ పక్క కాంపౌండ్‌లో ఆడుకుంటున్నారక్కా!" అని చెప్పింది పక్కింటి పద్మ.

"కొంచెం పిలువు పద్మా!" అన్నాను.

ఆ అమ్మాయి రెండు నిమిషాల్లో తిరిగొచ్చి - " వాళ్ళు రారంట అక్కా! కాకరపూలు ఏరుకుని బండమీద పోసుకుని ఆడుకుంటున్నారు!" అంది.

ఎంత నిర్లక్ష్యం ఈ పిల్లలకి! వేలెడంత లేరు. నాకోపం నషాలానికి ఎక్కుతుండగా కాంపౌండు గోడ దగ్గరికి వెళ్ళి చూశాను. అక్కడ కాకరపూల (పున్నాగ పూల) చెట్టుకింద కూచుని కాకర పూల కాడల్ని మేళంలా నోట్లో పెట్టుకుని ఊదేస్తూ ఉన్నారు.

"ఏయ్ బప్పీ! కిన్నూ రండీ!" అంటూ గుద్దులరిమాను.

ఈ దేశంలో తల్లిమీద బిడ్డలకి ఉన్న నిర్లక్ష్యం చిన్నప్పటి నుంచే వస్తుందనటానికి తార్కాణం మా పిల్లలే!

నన్నో పనికి మాలిన దాన్ని చూసినట్లు ఓ చూపు విసిరి 'వస్తాను ఉండమ్మా!' అన్నాడు కిన్నూగాడు.

"ఇదిగో ముందు అక్కణ్ణుంచీ లేస్తారా? తన్నులు కావల్లా?" అన్నాను కోపంగానే.

'ఈ రాక్షసి వదిలేలా లేదురా' అన్నట్లు నావేపు ఓసారి చూసి - ఒరే కిన్నూగా! పదరా పోదాం! ఇంట్లో ఆడుకుందాం పదా!" అంది బప్పీ. ఇద్దరూ లేచి నిల్చున్నారు.

'మేమేదో దయతలచి వస్తున్నామే కానీ నీ అరుపులకీ, తన్నులకీ జడిసి మాత్రం కాదు సుమా!' అన్న ధోరణిలో నిదానంగా పూలనన్నింటినీ ఒళ్ళో వేసుకుని పెళ్ళి నడకతో బయల్దేరారు.

గబగబా ఇంట్లోకి వెళ్ళాను - వాళ్ళకి టిఫిన్లు రెడీగా ఉంచడానికి. రెండు ప్లేట్లలో చపాతీలూ, ఉర్లగడ్డ కూరా ఉంచాను.ఎలాగూ వస్తున్నారు కదా అని ఎదురు చూస్తూ కూచున్నాను. ఎంతకీ రారే! ఏమయ్యారు వీళ్ళు! అని మళ్ళీ వాకిట్లోకి తొంగి చూశాను. నిదానంగా చీమనడకతో కాకర పూల రెక్కల్ని బుడగలుగా మార్చే ప్రయత్నం చేస్తూ ఉన్నారు.

"ఏం బిరబిరే నడవలేరా? లేక, రెండు అంటించల్లా?" అన్నాను విసుగుతో

"ఎందుకు అంటిస్తావు?" అన్నాడు కిన్నుగాడు. అదోలా నావైపు చూస్తూ.

వాడు నేర్చుకొన్న మాటల్లో 'ఎందుకు?' అన్నది మొదటిది. ప్రతి మాటకీ ముందు దాన్ని ప్రయోగిస్తుంటాడు. వాడి 'ఎందుకు'కు సమాధానం చెప్పకుండా ఇద్దరి రెక్కలూ పుచ్చుకుని బాత్‌రూమ్ లోకి లాక్కెళ్ళి చేతుల్ని శుభ్రంగా కడిగించి పళ్లేలముందు కూలేశాను.

"అయ్యో! చపాతీలేనా!" అంది నిరుత్సాహంగా బప్పీ.

"ఎందుకు చేసినావమ్మా చపాతీలూ నాకొద్దు!" అన్నాడు కిన్నుగాడు.

"నోర్మూసుకుని తినండి!"అరిచేశాను.

"ఎందుకు తినడం! అంటూ వాడు.

"నోర్మూసుకుని ఎట్లమ్మా తినడం!" అంటూ అంది.

"ఎందుకూ, ఎట్లా అన్నారంటే నాలిక్కో సేస్తాను - మీరు పిల్లలు కాద్రా పిడుగులూ! ఊ తినండి! తినక పోయి నారంటే కట్టె తీసుకుని కూరుతాను!" అన్నాను పూర్తిగా అసహనంగా.

"మేము తినము అంటే కూరతాను అంటావు - రాత్రి నాన్న తినను అంటే.... పోనీ ఏం చేయాలో చెప్పండి అన్నావే! బతిమాలుతూ!" అంది బప్పీ

నిజానికి వీళ్ళని కాదు అనాల్సింది వీళ్ళ బాబుని అనాలి.... తిండి విషయంలో ఆయన మహా చండశాసనుడు - ఇష్టం లేని తిండిని వేలితో కాదుకదా కొనగోటితో కూడా తాకడు. పులి కడుపున పిల్లులు పడతాయా?

"ఈ పూటకి ఎట్లో ఒకట్ల సర్దుకోండ్రా!" అంటూ నేనే రాజీకి దిగాను.

"సరే, అయితే ఈ ఉర్లగడ్డకూర నేను తినను!" అంది బప్పి.

'నేను దీన్ని తినను" అంటూ కిన్నుగాడు.

అది 'తానా' అంటే, వీడు 'తందానా'..... ప్రతి విషయంలోనూ ఇంతే!

"మరి ఏం చెయ్యల్లో చెప్పన్నా ఏడ్వంది!" అన్నాను కోపాన్ని దిగమింగుతూ


"ఆమ్లెట్ కావల్లి!" అంది బప్పి.

"నాకూ ఆమ్లెట్టే కావల్ల"

"చచ్చాన్రా దేవుడా!' అనుకుంటూ వంటింట్లోకి దూరాను ఉల్లిపాయల్ని తరిగేందుకూ. ఏమయితేనేం. పావుగంటలో రెండు ఆమ్లెట్లు తయారు చేశాను. అప్పుడు బుద్దిగా తిన్నారు పిడుగులిద్దరూ!

"ఏమ్మా సుమా! బావున్నారా?" అంటూ కొత్తగొంతు వినిపిస్తే బయటి.గదిలోకి తొంగి చూశాను. ఎవరో లావుపాటి ఆవిడ. ఆమె ఎవరో నాకైతే గుర్తు లేదు. కనీసం గొంతయినా గుర్తుపట్టలేక పోతున్నాను. కంచుగంటలా 'ఖణేల్' మంటోంది ఆమె కంఠం!

"ఆ బావున్నానండీ!" అంటూ బయటిగదిలోకి వచ్చాను. ఆవిడ ఆకారాన్ని పరిశీలిస్తూ. ఆవిడ ఎర్రగా బొద్దుగా ఉంది. మొహం కోలగా ఉంది. కళ్లకి సోడాబుడ్డి కళ్ళజోడు పెట్టుకుని ఉంది. మధ్యగా తీసిన పాపిటకి ఇరువైపులా తెలుపూ, నలుపు సమంగా ఉన్న జుత్తు



ఉంది. పాపిట-మొదట్లో పావుకిలో ఎర్రటి కుంకుమ అద్ది వుంది. నుదుటిమీద అరకిలో. కుంకుమతో పెద్దరూపాయి కాసంత బొట్టు పెట్టి ఉంది. చిన్నటి ఎర్రపూవుల మధ్య నీలపు ఆకులున్న పసుపు చీర కట్టుకుని ఉంది. అదే రంగు జాకెట్టు వేసుకుని, చెవులకి పెద్దపెద్ద రవ్వల కమ్మలూ, ముక్కుకి ఇరువైపులా బొటనవేలంతటి ముక్కెరలూ, మెడ లో ఓ పదికిలోలకిమ్మత్తు కలిగిన రకరకాలయిన దండలూ, వేసుకుని ఉంది. పెదాలకి ఏ నగలు అలంకరించటానికి వీలు పడదనేమో చిరునవ్వుని పులిమినట్టుంది. ఈమె ఈ జన్మలో కాకున్నా వెనక జన్మలో నైనా అందగత్తె ఉంటుంది. అందుకే ఇంతలావులోనయినా పూర్వజన్మ అందం వీడనట్టు అనిపిస్తూ ఉంది. నిర్మలంగా నవ్వుతూ ఉంది- నేను గుర్తుపట్టనట్టు చూస్తూ ఉన్నా కూడా!

"నన్ను గుర్తుపట్టలేదు కదా! నేనమ్మా, కాంతాన్ని! మీకు చానా దగ్గిర బంధువునమ్మా! మీ మేనమామ నారాయణ లేడా ఆయప్ప మామ తమ్ముడు ఈశ్వరయ్య బామర్ది చెల్లిలి ఆడబిడ్డనమ్మా! మీ మరిది రాఘవులు పెండ్లిలో నన్ను చూసినావు, మనిద్దరమూ ఒకే బంతిలో కూచ్చోని పక్క

పక్కనే భోంచేసినాము కూడా! అంది నవ్వుతూనే.

ఆమోఘమైన ఆమె జ్ఞాపకశక్తి మీద అపారమైన గౌరవం కలిగిందా క్షణంలో. వెంటనే ఆమెకు గోద్రెజ్ కుర్చీ వాల్చాను.

"టిఫిన్ తెస్తానుండండి!" అంటూ వంటింట్లోకి వెళ్తుంటే

"వద్దమ్మా సుమా! ఇప్పుడే మా బావ వాళ్ళింట్లో టిఫిన్ తినేసి వస్తిని. ఎట్లా ఈ ఊరికి వచ్చినాను కదా అని మిమ్మల్ని చూసి పోదామని ఇట్ల వస్తిని.. ఈ ఇట్ల మా బావ చూపించె.. అన్న ఆఫీసుకి పోయినాడేమో కదా!" అంటూ నన్ను అక్కడే ఆపేసింది. నేను మరో కుర్చీలో కూలబడి పోయినాను.

ఆమె మాటలన్నిటికీ 'ఊ', 'అవును' లతో సరిపెడుతూ ఉన్నాను.

కొత్తవాళ్ళతో ఏమ్మాట్లాడాలో నాకైతే ఎప్పటికీ అర్థం కాని విషయం. బబ్బీ, కిన్నూలు నాకు చెరో వైపు చేరి ఆనుకుని ఆవిడనే చూస్తూ ఉన్నారు.

"అమ్మా! ఎవరూ!" అంది మెల్లగా బబ్బీ.

ఏం చెప్పాలి నేను... ఆమె చెప్పిన బీరకాయ పీచు బంధుత్వంలో ఆమెని ఏ వరుసతో పిలవాలని చెప్పనూ!

"నేను మీ పెద్దమ్మనమ్మా! పాపా! నీపేరు చెప్పమ్మా!" అంది నవ్వుతూ

"నాపేరూ.. బబ్బీ, వాని పేరు కిన్నూ" అంది మొహంలో ఏమార్పు లేకుండా.

"అవి ముద్దు పేర్లేమో... . అసలు పేర్లు చెప్పూ!"

"భవ్య దీనిపేరు, 'కిరణ్' వీనిపేరు" అన్నాను నవ్వుపులుముకుని

"ఏం చదువుతున్నార్రా మీరిద్దరూ!" అంటూ 'బబ్బీ'ని దగ్గరకి లాక్కొని, కిన్నూ గాని కోసం చేయి చాచింది. వాడసలే 'అమ్మకూచి' నా ఒళ్ళోకి దూరుకున్నాడు.

"ఇప్పుడు చెప్పు, ఏం చదువుతున్నావూ.. ఫస్ట్ క్లాసా, సెకెండ్‌క్లాసా?"

"అంటే?" అంది బబ్బి - వింతగా ఆమెవైపు చూస్తూ.

"తెలీదా? ఒకటో క్లాసా, రెండో క్లాసా నువ్వు చదివేది?"

అయోమయంగా నావైపు చూసింది ఆవిడ.

"ఇంకా ఏం లేదక్కా... అసలు బడికి పంపనేలేదు" అన్నాను.




"ఇంత ఎత్తుంది బడికి పంపనేలేదా? ఎన్నేళ్ళూ?"

"దీనికి అయిదున్నర, వీనికి నాలు గేండ్లు" అన్నాను.

"మరింకేమ్మా ఈపాటికి పాప 'యూకేజీ', వీడు 'నర్సరీ' ఉండాల్సిందీ!"

"మా ఆయనకి కాన్వెంటు స్కూళ్ళంటే గిట్టవండీ!"

"అదేందమ్మా బలే విచిత్రంగా ఉందే! పిల్లోల్లకి ఇప్పట్నించీ ఇంగ్లీషు చదువులు చదివిస్తే గదా అంతో ఇంతో నేర్చు కోనేది. ఈ వయసు పిల్లోల్లకి ఎన్నెన్ని ఇంగ్లీషు రైమ్సు వస్తుండల్లా, ఏం కతా! కొత్తవాళ్ళు ఎవరన్నా ఇంటికొస్తే 'ఏదమ్మా ఒక 'రైమ్' చెప్పూ!' అంటూనే పది రైములు వరస బెట్టి గడగడా వప్పజె ప్పేయ్యల్ల, తెల్సిందా? మా పెద్దపాప ఆదిలక్ష్మి పిల్లలు ఇదే వయసు వాళ్ళు, నోరు తెరిస్తే ఇంగ్లీషు పద్యాలేనమ్మా. ఏం తెలివితేటలో... అంత తెలివైన పిల్లల్ని నేను ఎక్కడా చూడలేదమ్మా!" అంటూ మురిసిపోతూ, చెప్పుకుపోతూ ఉంటే నాకు ఒళ్ళంతా జెర్రులు పాకినట్టు కంపరంగా ఉంది.

తన పిల్లలు ఇతరులకి తెలివితక్కువ వాళ్ళగా అనిపిస్తే ఏ తల్లికి మాత్రం బాధక లుగదూ? నాకూ అట్లాంటి బాధే కలిగింది. ఆ లావాటి మనిషికి బయటికి ఈడ్చేసి, పిల్లల్ని చావ బాదుదు బాదాలనిపించింది ఆ క్షణంలో. నాగరికత లక్షణాలలో 'నవ్వుతూ మాట్లాడటం అన్నది ఒకటి' అని ఎక్కడో మెదడులో గూడుకట్టుకొని ఉండటం చేత ఆవిడ లక్షణంగా కుర్చీపైన కూచుని ఉంది, నేను లేని నవ్వుని పులుముకుని మాట్లా డుతున్నాను. టీవీ అనౌన్సర్‌లా.

నిజానికి మా పిడుగులూ గొప్ప తెలి వితేటలు ఉండే పిల్లలు కాదుకానీ, తెలివి తక్కువ పిల్లలు మాత్రం కాదన్న విషయం నాకు తెలుసు. అయితే, అది ఇతరు లకి ఎలా చెప్పడం! తప్పంతా మాదేనేమో ఇంత వయసు వచ్చినా వాళ్ళని కాన్వెంటు స్కూళ్ళకి పంపక పోవడం.... కనీసం ఒక్క ఇంగ్లీషు పాటో, పద్యమో నేర్పకపోలేదు.

"ఇప్పటికయినా మించి పోయిందేది ఏమి లేదమ్మా సుమా! ఏదన్నా మంచి కాన్వెంట్ స్కూలు జూసి చేర్పించండి! వీళ్లు స్కూలుకు పోతే నీక్కొంచెం తీరిక దొరుకుతుంది." అంది కాంతమ్మ.

"ఆరేండ్లు వచ్చేదాక బళ్లో చేర్పించను అంటాడక్కా! మా ఆయన" అన్నాను ఏమనాలో తెలీక.

'ఇదంతా చూస్తుంటే మీరు పాత కాలపు మనుషులు మాదిరి ఉన్నారమ్మా! ఇప్పుడు పిల్లల్ని పాడు చేస్తారు. పెద్దయి నాక వీళ్ళు మిమ్మల్ని తిట్టిపోస్తారు." అంది కాంతమ్మ అంతిమతీర్పు ఇస్తున్న జడ్జిలా.

ఆమె మాటల్ని కాదనలేక పోయి నాను. ఓ అరగంట ఆమాటా, ఈమాటా మాట్లాడాక వెళ్ళిపోయిందావిడ.

మధ్యాహ్నం భోజనానికి మావారు వచ్చినప్పుడు ఆవిడ గురించి, ఆవిడ అన్న మాటలు గురించీ చెప్పాను. అన్నీ విన్నాక - 'మన పిల్లల చదువు విషయంలో నువ్వేం దిగులు పెట్టుకోకు. చదువుదే ముందీ దానంతటదే వస్తుంది"! నింపా దిగా, సుష్టుగా భోంచేసి తృప్తిగా నావైపు చూస్తూ అన్నాడు.

అంతే ఈ మనిషి - ఈయన ఆద ర్శాలూ, సిద్ధాంతాలూ, నాకెప్పుడూ అర్థం కావు. ఊరందరిదీ ఒకదారయితే ఉలిపిరి పిట్టది ఒక దారంట... తక్కిన తల్లిదండ్రులు పిల్లల చదువులో' అంటూ ఎంతెంతో ప్రయాస పడుతూ ఉంటే.... ఈ మనిషికి చీమ కుట్టినట్టయినా లేదాయెమరి! అంతా నాకర్మ!!


"మనం 'మమ్మీ, డాడీ' అని పిలిపించుకుందామండీ పిల్లల్తో" అన్నాను ఓరోజు. అంతే - 'ఖయ్'మని లేచాడు 'సుమా! నీతల్లో మెదడనే పదార్థం ఉందా? ఉంటే అది ఆలోచించడం మానుకుందా? "అమ్మా! నాన్నా!" అనడంలో ఉన్న ఆత్మీయతా, ఆప్యాయతా 'మమ్మీ, డాడీ' లతో ఉన్నాయా అంటూ ఎగిరెగిరి పడ్డారు.

ఆయనకు 'మమ్మీడాడీ'లే కాదు, ఏ,బీ,సీ,డీలు పిల్లలకి నేర్పించడమన్నా అంత ఇష్టంలేదు. ఓసారి పలకలో ఏ,బీ,సీ,డీలు రాసి ఇచ్చాను. అది చూసి ఆయన, "ఇంగ్లీషు అక్షరాలు 26మాత్రమే సుమా! సులభంగా నేర్చుకుంటారు. తెలుగులో ఏభై ఆరు అక్షరాలు... వత్తులూ, దీర్ఘాలూ కలిపితే రెండువేలు పైబడి ఉంటాయి. వీటిని నేర్చుకోవడం అంత సులభం కాదూ అందుకే తెలుగు నేర్పూ... ముందు 'ఏబీసీ'లు నేర్చుకున్న పిల్లలు 'అఆ'లు నేర్చుకోవాలంటే ఇబ్బంది పడతారు..." అంటూ లెక్చర్ దంచేశాడు.

'కనీసం ప్రైవేట్ కయినా పంపిద్దామండీ పిల్లల్ని!" అంటూ ఓరాత్రి పడుకోబోయేముందు మెల్లగా చెప్పాను. గుర్రుమని నావైపు చూశారు. 'ఏదో ఓ పూట అట్ల అలవాటు కానీలేండి!' అన్నాను. ఏ మూడ్‌లో ఉన్నారో ఏమోగానీ 'ఊ' 'అనేశారు.

ఎట్టకేలకు ఓ శుభోదయాన బప్పీనీ, కిన్నూగాణ్ణీ ఓ ప్రైవేటులో చేర్పించి 'అమ్మయ్యా!' అనుకుని ఇంటికొచ్చేశాను. చాలా హాయిగా ఉంది మనసు, ఓ మంచి పని చేసిన ఫీలింగు! అఆలతో పాటూ, ఇంగ్లీషు అక్షరాలూ, రైమ్సూ నేర్పించమని పదేపదే చెప్పి వచ్చాను. ఇంక ఎవరయినా కొత్తవాళ్ళు ఇంటికొస్తే 'ఝుమ్మని' రైమ్సు చెప్పండర్రా! అనేస్తే చాలు... పిడుగులు చెప్పేస్తారు... 'ఆహా ఎంత తెలివయిన పిల్లలమ్మా మీ పిల్లలూ, మేమెక్కడ ఇంత తెలివయిన వాళ్ళని చూడలేదు' అనక చస్తారా!' అని ఊహించుకుంటూ నామనసు ఆనందతాండవం ఆడింది. ఇవన్నీ మావారితో చస్తే చెప్పకూడదని నిర్ణయించుకున్నాను.

ఉన్నట్టుండి వంటింట్లోకి ఘొళ్ళున ఏడుపు వినిపించింది. బయటికి వచ్చి చూద్దును కదా పిల్లలిద్దరూ పెద్ద పెట్టునా ఏడుస్తూ వస్తూ ఉన్నారు. అయోమయంలో గుండెలు కొట్టుకుంటూ ఉండగా ఎదురెళ్ళి ఆత్రంగా 'ఏం జరిగింది?' అన్నాను.




"అమ్మా! మరేమో.... ఊ.... ఊ" అంటూ బెక్కుతోంది బప్పీ.

"చెప్పవే! ఏం జరిగింది?" ఆత్రంగా నేను.

"ఊ...ఊ... టీచరు కొట్టింది!" ఏడుస్తూ అంది.

"నిన్ను కొట్టిందా?" అడిగాను కిన్నూగాడిని.

"ఊహూ బప్పీని కొట్టిందమ్మా!"

"మరి నువ్వెందుకూ ఏడవడం?"

"మరీ మరీ... బప్పీని కొట్టింది కాబట్టి!"

"ఎందుకు కొట్టిందే టీచరు?"

"టీచరు 'అఆ' రాసిచ్చింది పలకలో.... నేను 'అఆ' రాస్తా ఉన్నాను. అయినా గానీ కొట్టిందమ్మా!" అంటూ ఏడుస్తూనే చెప్పింది.

టీచరు ఎందుకు కొట్టిందో కనుక్కు రమ్మని పంపను పద్మని. వెంటనే కనుక్కు వచ్చిందా అమ్మాయి. "అఆలు తిరగేసి రాసిందట అక్కా! 'సరింగా రాయమంటే, 'నేను ఇట్లే రాస్తాను' అంటూ రాస్తా ఉంటే చిన్నగా కొట్టిందంట!" అని పద్మ చెబుతోంటే నాకు కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ఏం మనిషో! ప్రైవేటుకి వేసిన రోజే కొట్టాలా? ముందుముందు ఈ పిల్లల్ని ఎంత కొడుతుందో కదా అని నాకు మరీ ఏడుపు ముంచుకొచ్చేసి పిల్లల్నిద్దర్నీ హత్తుకున్నాను.

పిల్లలకి ప్రేమతో చదువు నేర్పాలనీ, పాఠశాలలన్నీ ప్రేమ మందిరాలలా ఉన్నప్పుడే పిల్లలకి చక్కటి విజ్ఞానం, మనో వికాసం కలుగుతాయని అపుడపుడూ మావారు అనే మాటలు జ్ఞాపకానికొచ్చాయి. అది సరేగాని, ఈ విషయం ఆయనకి తెలిస్తే నన్ను ఉప్పుపాతర వేయరూ, అధమం మాటలతో గుండెను చీల్చనైనా చీల్చేస్తాడు... అని అనుకుంటూ ఉంటే కాళ్ళల్లోనూ, వెన్నులోనూ ఒకేసారి వణుకు ప్రారంభమైంది.

"ఒసే బప్పీ! మీ టీచరు కొట్టడమూ, నువ్వు ఏడవడమూ ఇవన్నీ మీ నాన్నతో చెప్పొద్దు!" అంటూ బుజ్జగించినట్టు చెప్పాను. మూరెడు గ్లాసుకి పాలిస్తూ.

"ఊ అంటూ కొండపల్లి బొమ్మలా తల ఆడించింది. పద్మతో రెండు చాక్లెట్టులు తెప్పించి లంచంగా ఇచ్చాను పిడుగులిద్దరికీ.

మధ్యాహ్నం భోజనానికి రాలేనని ఫ్యోన్‌తో చెప్పి పంపారు ఆయన. సాయంత్రం అయిదున్నర అవుతున్నట్టే వచ్చేశారు. ఆయనకి కాఫీ ఇవ్వడానికని వంటింట్లోకి వెళ్ళాను.

బప్పీ ఎప్పుడొచ్చిందో నా దగ్గరికి గుసగుసలతో "అమ్మా! నాన్నతో టీచరు కొట్టిందని చెప్పదునా!' ' అంది రహస్యంగా. ఇదంతా కిన్నూగాడు కనిపెడుతూ ఉన్నాడు.

"వద్దే! అందుకేగదా! చాక్లెట్లు కొనిచ్చింది" అన్నాను.

"సరే! అంటూ ఏమీ ఎరుగని దానికి మల్లే వెళ్ళిపోయింది - బయట గదిలోకి. కిన్నూగాడు కూడా తలాడించేసి వెళ్లాడు.

నేనింకా కాఫీని గ్లాసులోకి పోస్తూ ఉన్నాను. బయటినుంచీ బప్పీ అంటోంది కదా! - "నాన్నా! నన్ను టీచరు కొట్టలేదు, నేను ఏడవలేదు." అని.


'ఓసి పిడుగా!' పళ్ళు నూరుకున్నాను.

"ఏందమ్మా! టీచరు కొట్టకుంటే ఎందుకేడుస్తారు ఎవరైనా?" అంటున్నాడాయన - పసిపిల్ల ఏదో ఒకటి మాట్లాడేస్తుందిలే అని.

"అవున్నాన్నా! టీచరు కొట్టలేదు - బబ్బీ ఏడసలేదు.... అమ్మ మాకు చాక్లెట్లు ఇవ్వలేదు... మేము తిననేలేదు!" అంటు కిన్నుగాడు.

నేను దడదడలాడుతున్న గుండెలతో కాఫీ తీసుకు వెళ్తే మావారు తికమకతో నావైపు చూశాడు. నాకు ఏవ్వాలో ఏడవాలో తెలీలేదు. ఈ పిడుగులతో నాకు బావొచ్చింది.

చిట్ట చివరికి అసలు విషయం వివరంగా చెప్పేసి తలవాచేలా చివాట్లు తినాల్సివచ్చింది.




* * *

తన ఉనికిని తెలుపుకోడానికి అప్పుడపుడూ దేవుడు కరుణిస్తాడల్లే ఉంది. లేకపోతే పక్కవీధిలో బంధువుల ఇంటికి వెళ్ళడానికి సైతం ఒప్పుకోని మావారేమిటీ, కర్నూలులో ఉన్న మా అక్కయ్య ఉమను చూసి రావడానికి ఒప్పుకోవడమేమిటీ!

ఓ మూడు రోజులు ఆఫీసుకి సెలవు పెట్టారు మావారు. అందరం బయల్దేరాము. సాయంత్రం అయిదు గంటలయింది కర్నూలులో మా అక్కయ్య వాళ్ళిల్లు చేరుకునేటప్పటికి. బావగారు అదేదో ఆఫీసులో ఇంజనీరుగా ఉన్నారు. మంచిస్థితిగల కుటుంబం వాళ్లది. అక్కయ్యకి ముగ్గురు పిల్లలు, పెద్ద పిల్లలు ఇద్దరూ మా పిడుగుల కంటే పెద్దవాళ్లే. మూడోది కిన్నూగాడి కంటే ఏడాది చిన్నది.

"ఒరేయ్! మీ అనంతపురం ఆంటీ అంకులూ వచ్చినార్రా!" మమ్మల్ని చూసి నవ్వుతూ. పిల్లలు ముగ్గురూ చుట్టుకున్నారు. ఐదు నిమిషాల్లో పిల్లలు అయిదుగురూ ఒక గ్రూప్‌గా, పెద్దలంతా ఒక గ్రూపుగా విడిపోయినాము. అక్కయ్య పిల్లలు వాళ్ల బొమ్మలు చూపిస్తూ ఉంటే మా బబ్బీ, కిన్నూలు ఆనంద పడిపోతున్నారు.

అక్కయ్య 'టీ' చేసి ఇచ్చింది. అప్పటికీ మా బావ ఇంకా రాలేదు.

"ఏమే సుమా! పిల్లలు ఏం చదువుతున్నారే!" అంది నవ్వుతూ పిల్లల వైపు చూస్తూ - అక్కయ్య.

నేను పాతపాటే పాడాను.

"ఇంత వయసొచ్చినా స్కూల్లో వేయనే లేదా!" అంటూ ఆశ్చర్యపోయింది అక్కయ్య.

"ఆరేండ్లలో పడుతో వే బళ్లో వేస్తాం వదినమ్మా!" అన్నాడు మా ఆయన నవ్వుతూ.

"ఏమప్పా! మరీ పాతకాలపు మనిషి మాదిరున్నావు! మా పిల్లలు చూడూ, సందీప్ సెకెండ్ క్లాసూ, ప్రదీప్ ఫస్ట్ క్లాసూ, సుష్మ ఏమో నర్సరీ!" అంటూ చెబుతూనే పిల్లల వేపు తిరిగి- " ఒరే సందీప్, ప్రదీప్ - మీ ప్రోగ్రెస్ రిపోర్టులు చూపండ్రా ఆంటీకి, అంకుల్ కూ-" అంది.

అంతవరకూ ఆడుకోవడంలో నిమగ్నమయి ఉన్న పిల్లలు ఇద్దరూ తమ బండెడు పుస్తకాల్నీ వెదకి ప్రొగ్రెస్ రిపోర్టులు పట్టుకు వచ్చారు.

మావారు ఓసారి వీటిని అలవోగ్గా చూసి పక్కన పెట్టేశారు. పిల్లలు ఎంతో ఆసక్తితో తెచ్చి ఇచ్చారన్న 'ఇది' కూడా లేదాయనకి. నేను వాటిని అందుకుని "వెరీ గూడ్! మంచి మార్కులు తెచ్చుకున్నారు. ఇట్లే మంచి మార్కులు తెచ్చుకొని పాసు కావల్ల!" అంటూ అభినందించి వాళ్లిద్దరికీ ముద్దులు పెట్టాను.

'వాళ్ళు మంచి మార్కులు తెచ్చుకోకుంటే వదిలే వాళ్ళెవరు? పోయినసారి టెస్టుల్లో 'సి' గ్రేడ్ మార్కులు వచ్చాయి ఇద్దరికీ - ఆ రోజైతే నేను ఏడ్చేసినాను. అప్పట్నించీ శ్రద్ధగా ట్యూషన్సుకు పంపుతున్నాం. ఉదయం, సాయంత్రం ఆడుకోకుండా నేను దగ్గరుండి హోమ్‌వర్కు చేయిస్తాను. ఇట్లా చేసినందువల్లే ఇప్పుడు 'ఏ' గ్రేడ్ మార్కులు వచ్చాయి ఇద్దరికీ!" అంటూ అక్కయ్య చెప్పుకుపోతోంది.

అక్కయ్యకి పిల్లల హోమ్‌వర్క్ జ్ఞాపకం వచ్చిందేమో 'ఒరేయ్! హోమ్‌వర్క్ చేస్కోండ్రా ముందు, ఇంక కాసేపటికి మీ డాడీ వచ్చాడంటే మీరు ఏ హోమ్‌వర్కు చేయలేదని మీ వీపు చీరేస్తారు. ముందు పుస్తకాలు తీసుకురండి!" అంటూ హుకూమ్ జారీ చేసింది.

బబ్బీ కిన్నూలతో ఆడుకుంటున్న పిల్లలు కిక్కురుమనకుండా లేచివచ్చి పుస్తకాలు ముందేసుకున్నారు. తనను కూడా తల్లితిడ్తుందనుకుందేమో సుష్మా కూడా పుస్తకాలు తెచ్చుకుని కూచుంది. అయితే ఆ పిల్ల చూపులన్నీ బబ్బీ కన్నుల మీదే. బబ్బీ, కిన్నూలకి ఏమనిపించిందో లేచి వచ్చి వాళ్ళ దగ్గరికి చేరారు. అయోమయం చూపులతో వాళ్లని చూస్తూ కూచున్నారు మధ్యమధ్యలో వాళ్లు రాస్తున్నదేవిటో అడిగి తెలుసుకుంటున్నారు.

అదంతా చూస్తుంటే మావారికెట్లా ఉందో ఏమోగానీ, నాకు మాత్రం అదో రకమైన బాధ మనసులో గూడుకట్టుకొంది.

"ఏయ్! బబ్బీ, కిన్నూ ఇటుండర్రా! వాళ్ళని హోమ్‌వర్కు చేస్కోనియ్యండి!" అంటూ మా పిల్లల్ని పిల్చింది అక్కయ్య.

నాకెందుకో కలుక్కుమంది గుండెలో - మావారు ఇదేమి పట్టించుకోనట్టు ఏదో పత్రిక చదువుకుంటూ ఉండిపోయారు.

ఓ గంట తర్వాత మా బావ వచ్చాడు. ఆయన ఓ చుట్టు లావయినాడు. పొట్ట బాగా ముందుకు వచ్చింది. అయినా, ఆయన ఇన్‌షర్ట్ చేసుకున్నందువల్ల బాగానే అనిపిస్తోంది. నవ్వుతూ ఆత్మీయంగా పలకరించారు మమ్మల్ని. మా పిల్లల్ని దగ్గరకు తీసుకుబోయాడు. మా మొదటి పిడుగు ఆయన దగ్గరికి వెళ్లింది. రెండో పిడుగు మాత్రం సిగ్గుతో నా చంక ఎక్కాడు.

పిల్లల చదువు గురించి (అడిగారు) మేము పాత రికార్డు వేశాము.

అపర పండితుడు, ఓనామాలు రాని పామరుల్ని చూసినట్టు ఓ తేలిక చూపు విసిరి - 'మీవి వాలా పాత పద్ధతులు - సావబడితేనే వజ్రమయి ప్రకాశించేది... అంటూ మినీ లెక్చరొకటి ఈ పామరులకి సోదాహరణంగా ఇచ్చేశాడు.


"పిల్లలు ప్రాణంలేని వజ్రవైఢూర్యాలు'

కాదుగా సాన పెట్టేదానికి! అంటూ మావారు గొణిగారు.

మావారి వింత మనస్తత్వానికి నాకు చిరాకేసింది.

పామరులకి లెక్చరివ్వటం వరకే తన వంతయినట్టు మావారి గొణుగుడిని వినిపించుకోకుండా పక్కగదిలోకి దూరి బట్టలు మార్చుకొని లుంగీ బనియన్‌తో బయటకొచ్చాడు బావ.

మేము కొంచెం ఏమరు పాటుతో ఉండటం గమనించిన పిల్లలిద్దరూ అల్లరి మొదలు పెట్టేశారు.




"అమ్మా చూడమ్మా! నాకోతి బొమ్మని తీసుకొంటున్నాడు" అని బవ్వీ, 'అమ్మా నా కారు బొమ్మ గుంజుకుంది చూడూ! 'అంటూ కిన్నూగాడూ-

'ఇద్దో పిల్లల్లూ! గలాటా చేయ కూడదూ! అన్నయ్య వాళ్ళు చదువు కుంటున్నారు - డొంట్ డిస్టర్బ్ దెమ్!" అన్నాడు బావ చివరి వాక్యం అర్థం కాకెమో మరి ఇద్దరూ ఒక్కసారి నన్నూ, మావారినీ చిత్రంగా చూసి గప్‌చిప్‌గా అయిపోయి నారు.

మాతో మాట్లాడటం వేస్టు అనుకున్నాడేమో ఓసారి మావేపు చూసి, చదువుకుంటున్న తన పిల్లల దగ్గరకు పోయి కూచునీ, హోమ్‌వర్క్ చేయడంలో వాళ్ళకి సహకరిస్తూ ఉండిపోయాడు బావ.

అరగంట గడిచాక వాళ్ల పిల్లల హోమ్ వర్కు అయిపోయింది. అప్పుడు మాతో పిచ్చాపాటీ మాట్లాడ్డానికి దగ్గరగా సోఫాలో కూచున్నాడు. ఉన్నట్టుండి 'ఒరే సందీప్! కమ్ హియర్! అంకుల్, ఆంటీలకి పోయెమ్ ఒకటి అప్పజెప్పరా! అంటూ ఆజ్ఞ జారీ చేశాడు.

"హూ హాస్ సీన్ ది విండ్....... " అంటూ సందీప్ ఇంగ్లీషు పద్యం అప్పజెపుతూ ఉంటే, మావారూ, నేను గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాం. వాడు చెప్పడం ఇంకా అయిపోయిందో లేదో వెంటనే, "ఒరే, ప్రదీప్! నువ్వు టేబుల్స్ (ఎక్కాలు) చెప్పరా!" అన్నాడు. తండ్రి చెప్పిందే తడవుగా మొదలు పెట్టి గడగడ అప్పజెప్పతున్నాడు.

మా అక్కయ్య గర్వంతో పొంగిపోతూ నవ్వుతూ నన్ను, మావారినీ చూస్తోంది. మగపిల్లలు ఇద్దరూ అయిపోగానే సుష్మకు ఛాన్సిచ్చాడు బావ. అది 'ట్వింకిల్ టింకిల్'.. అంటూ ముద్దుముద్దుగా చిన్న పెదవుల్ని చిన్నచిన్న కళ్ళనీ చిత్రమైన కదలికలతో నింపుతూ పాడింది. అంత తెలివైన పిల్లల్ని కనడం అక్కయ్య అదృష్టం అనిపించింది.

"ఏదమ్మా భవ్వా! నువ్వు చెప్పు!" అన్నాడు బావ.

ఎలా వినిపించిందో దానికి అదోలా చూసి 'నా పేరు బవ్వీ' అంది.

"సరేలే, కమాన్ టెల్ మీ!" అన్నాడు బావ.

"ఏంది పెద్దనాన్నా! తిక్కతిక్క మాటలు మాట్లాడతావు నీకి మాట్లాడేది రాదా!" అంది.

నాకు తల కొట్టేసినట్టయింది. మా బావ మొహం చిన్న బుచ్చుకున్నాడు. అక్కయ్య నవ్వుతూనే చూస్తూ ఉంది, ఇంక మావారు సరేసరి ఆనందంగా పుట్కా పుట్కా చూస్తున్నాడు కూతుర్ని.

"ఏయ్ బవ్వీ పెదనాన్నతో అట్లేనా మాట్లాడేది" అన్నాను.

"మరి పెదనాన్న మాటలు నాకు అర్థం కాలేదు." అంది

మావారు "అన్నా! పిల్లలకి అర్థంకాని భాషని తిక్క మాటలనే కదా అనుకునేది" అన్నారు. ఆయన చాదస్తం మీద నాకు భలే కోపం వచ్చింది.

"చిట్టీ చిలకమ్మా!" చెప్పవే అన్నాను.

"ఊహూ నేను చెప్పను - సిగ్గు"

"మా పిల్లలకి అట్లా సిగ్గుపడేది మాత్రం లేదు నాగరాజూ! ఎవరితోనైనా మాట్లాడతారూ, రైమ్స్, టేబుల్స్ చెబుతారు... క్లాసుల్లో ఎప్పుడూ వీళ్లే ఫస్టు! కాంపిటేషన్స్‌లో కూడా వీళ్ళే ఫస్టు.

భోజనం చేస్తున్నంత సేపూ పిల్లల చదువుల గురించే చెప్పాడు బావ. పెద్దవాడిని సైంటిస్టుగా, చిన్నవాడిని ఇంజనీరుగా, సుష్మాను డాక్టరుగా చేయాలని ఉన్నట్టు చెప్పాడు. మావారు అన్నిటికీ 'ఊఁఊఁ' అంటున్నారు ఆయన మొహంలో ఏ భావాలు లేవు.

భోజనాలు అయినాక మా నలుగురికీ వాళ్ళ డ్రాయింగ్ రూములో పక్కలు వేశారు. నా మనసులో కొత్త ఊరన్న ఉత్సాహంకానీ, అక్కయ్య ఇంటికి వచ్చానన్న ఆనందం కానీ లేవు. మనసంతా అదోరకమైన వికారం! ఇంతటికి కారణం మావారేనా... మా పిల్లలా.... అక్కయ్య వాళ్ల పిల్లల్లా నా పిల్లలు లేకపోవడమా.. బావ మావారికి తక్కువగా అనుకున్నాడేమోనన్న భావన్నా...... అక్కయ్య నన్నూ, నాకుటుంబాన్ని తక్కువ అంచనా వేసుకుందేమోనన్న ఫీలింగా... ఏమో... అన్నీ కలగాపులగంగా అయిపోయి ఉన్నాయేమో!

ఆయన సిగరెట్టు త్రాగుతూ బెడ్డు మీద కూచుని ఉన్నారు. పిల్లలు అలిసిపోయినారేమో అపుడే నిద్ర పోయినారు.

"ఈ బవ్వీ! సిగ్గెందుకో అర్థమే కాదు. ఆ 'చిట్టీ చిలకమ్మా' రోజంతా చెవులు గింగురుమనేదట్లు పాడేస్తూ ఉంటుంది. అక్కా బావల ముందు... ఇది... ఇంక ఈ పిడుగులకి ఇంగ్లీషు రైమ్సు నేర్పినా ఎవరిముందయినా చెప్పమంటే ఇట్లే తలవంపులు చేస్తారేమో... ఇద్దరూ ఇద్దరే?" అన్నాను. మరేం మాట్లాడాలో తెలీక.

అందుకాయన చిన్నగా నవ్వి ఓర కంట చూస్తూ-" "మనం పిల్లల్ని వస్తువులు మాదిరి చూడకూడదే! వాళ్లేం యంత్రాలా? ఎక్కడపడితే అక్కడ ప్రదర్శించేకి. అట్లా పిల్లలతో ఎదుటివాళ్ళ మెచ్చుకోలు కోసరం పద్యాలూ, పాటలూ చెప్పిస్తే పిల్లల్ని ఆ స్థాయికి దిగజార్చినందుకు వాళ్లని చూసి జాలిపడల్ల మనం!" అనేసి సిగరెట్టు తాగుతూ ఉండిపోయాడు.

ఏమిటో మంకు పట్టు మనిషి! ఆయన మాటలకి నాకు రక్త ప్రసరణ పెరిగి ఆయనకి వీపు చేసి పడుకున్నాను.

* * *

మరుసటి రోజు ఉదయం ట్యూషన్‌కూ, స్కూలుకూ వెళ్ళాము, భవ్వీ, కిన్నూలతో ఆడుకుంటాము' అని పట్టుపట్టారు అక్కయ్య పిల్లలు, చెరీ ఒక దెబ్బవేసి తరిమాడు బావ. బలి పీఠానికి వెళ్తున్న గొర్రె పిల్లల్లా మోపెడు పుస్తకాల్ని భుజాలకు తగిలించుకొని వెనక్కి తిరిగి చూస్తూ మాకు 'టాటా' చెబుతూ వెళ్లిపోయారు.

అంతే! మావారు "మనం వెళ్ళిపోదాం!" అన్నారు.

"ఏం?" అన్నాను.

"ఇంకొక రెండు రోజులు ఇక్కడే ఉంటే... ఇదంతా చూసీచూసీ, పిచ్చి ఎక్కుతుంది. అప్పుడు అనంతపురానికి కాదు వెళ్ళాల్సింది, నేరుగా విశాఖపట్నానికి" అన్నారు ఆవేశంగా.

అక్కయ్యకీ, బావకీ ఏదో 'టంగు టస్కు' చెప్పి, వాళ్ళని ఎట్లో ఒప్పించేసి అనంతపురానికి బయల్దేరినాము.

ఆటోలో వెళ్తుంటే అన్నాను "మీదంతా చాదస్తమండీ! పిల్లలకి చదువు ఎంత అవసరమో అక్కబావలకి బాగా తెలుసు! అందుకే ఆ పిల్లలు ఎంతబాగా చదువుకుంటున్నారో...."

"నిజమే సుమా! చదువుకోనీ.... ఈ రోజు మనము ఉన్నామనీ ఆ పిల్లలు ఇష్టంగా ఇంట్లో ఉండాలనీ ఆశపడినారు... కానీ, వాళ్లని నిర్దాక్షిణ్యంగా దెబ్బలు వేసి బడికి తరిమినారు. ఆ పిల్లలకు తక్కిన అన్ని విషయాలకంటే చదువు ముఖ్యమని మీ బావ ఉద్దేశం! మనిషికి ఇతర ఆనందాలు ఉంటాయని ఆయన మరిచిపోయినాడు. అసలు ఆ పిల్లలకి బాల్యం అంటూ ఉంటుందంటావా? నా పిల్లలు అట్ల కాకూడదు వీళ్ళకి బాల్యం ఉండల్ల ఆడుతూ, పాడుతూ పెరగల్ల, ఉదయాలనీ, సాయంత్రాలనీ, వెన్నెలనీ చూసి ఆనందపడల్ల.... వాళ్ళ పిల్లలు చదివీ, చదివీ గొప్ప గొప్ప ఉద్యోగాల్లో చేరతారు, తలల్ని కంప్యూటర్లుగా మార్చేసుకుని డబ్బు సంపాదించే యంత్రాలౌతారు. నా పిల్లలు అతి మామూలుగా చదివి మనుషులవుతారు, మానవత్వం ఉన్న మనుషులవుతారు!" ఆయనలా చెప్పుకుపోతున్నారు.

నాకర్మ ఈయన ధోరణి ఏమిటో ఈ జన్మకి అర్థం కాదు కదా! ●







